# అల్లుడి అలక

కేవలం అజ్ఞానంచేత—ఏ విషయాన్ని గురించి మాట్లాడుతున్నానో దాని తలా తోకా తెలియని కారణంచేత — బొందను బడ్డవాళ్ళలో నే కూడా ఒకణ్ణి. సంఘంలో ఇటువంటి, అంటే నావంటి, అభిప్రాయానికే అర్హతలేనివాళ్ళు దురభిప్రాయాలు, (ఇంగ్లీషులో ముచ్చటగా "ఫాల్స్ కన్విక్షన్స్" అంటారు) కలిగి ఉండటానికి అవకాశాలూ, అవి చప్పున మార్చుకోకుండా ఉండటానికవకాశాలూ జాస్తిగా ఉంటూ ఉన్నై. ఈ కథ చదివినవారల్లా వెళ్ళి తలో బోగందాన్ని ఉంచుకోమనికాదు, ఒకవేళ ఎవరైనా అటువంటి పనిచేస్తే వారి చర్యను సంఘం ఏ దృష్టితో చూడాలని!

మా మామగారి విషయమై నేను శాంతంగా ఆలోచించి ఉండవలసింది. నేనాయన్ని విచారించటానికి తగిన అనుభవమూ జ్ఞానమూ కలిగిలేనని గమనించి ఉండవలసింది. అట్లా చేశానా? ఒక్కనాటికి చెయ్యలేదు! మిదుమిక్కిలి నా రక్తం ఉడికిపోయింది. ఆయన బోగందాన్ని ఉంచుకున్నాడని తెలియగానే, ఇక నాకు ఆలోచించటానికి తగిన శాంతం ఎక్కడిది?

నిజానికి లోకం దృష్టితో చూస్తే నేను శాంతంగా ఉండవలసిన అవసరం ఏముంది? అల్లుణ్ణిగా, మా మామగారి విషయమై నేను పొగరుబోతుతనం చూపించటానికవకాశం ఉంటూంటే ఎవడు వదులుకుంటాడు? ఒక్క పొగరుబోతుతనమే కాదు. ఆయన ఇతర కష్టసుఖాలతో నాకు ప్రసక్తి లేకపోయినా ఆయనలో ఈ కళంకం నాకు చాలా అప్రతిష్ఠకు కారణమన్నట్టు నటించటానికీ, ఆ ప్రకారం నన్ను నేను నమ్మించుకోటానికీ, ఆయన్ని మంచిగానైనా చెడుగానైనా కొత్తమార్గంలోకి తిప్పి ఆయన్ని బాగుచేసే బాధ్యత నామీద వేసుకోటానికీ, ఇందుమూలంగా నా యోగ్యత నలుగురికి — అడగని వాడిది పాపం!— వెళ్ళడించటానికి నాకు సంఘం అనుజ్ఞ ఇచ్చింది. అటువంటి అవకాశం ఎవడైనా వదులుకుంటాడా?

"అయితే, అబ్బ, నువ్వా సాంప్రదాయాలన్నీ చూసుకొని మరీ ఎందుకు పెళ్ళి చేసుకున్నావు కావూ?" అని ఎవరైనా అడిగినట్టయినా, సమాధానం ఉండనే ఉంది! శారదా బిల్లూ! ఆ అడావుడి! అంతా మా పినతండ్రిమీద పెట్టానూ! నిమిషాలమీద ఈ ఏర్పాట్లన్నీ అయిపోయినయ్యి! తీరా పదహారో రోజు పండుగనాడుగా, మా అత్తగారు బోగందని తెలిసింది! శారదా బిల్లని చెప్పిం తరవాత మరి నోరెత్తటానికుందా?.........అప్పటి నన్ను నేనెన్నడూ క్షమించలేను!

ఈ వార్త విన్నప్పుడు నన్ను చూచి తీరాలి. ఇల్లంతెత్తు ఎగిరిపడ్డాను. వెర్రివాడల్లే చెడవాగాను. మా బాబాయి అప్పటికే నన్ను మందలించాడు— వెధవల్లే ప్రవర్తించవద్దన్నాడు. నాకా మందలింపు ఆనలేదు. అప్పటి నా మనస్సుతో ఆలోచిస్తే నా మామగారు ఆయన సౌఖ్యానికి బోగందాన్ని ఉంచుకోవటం నాకు లక్షవిధాల అవమానకరంగానూ, అపకారంగానూ కనపడ్డది. అటువంటి వాడి కూతురితో కాపరమేమిటి పొమ్మనుకున్నాను. ఆ పెళ్ళాం నా కక్కర్లేదని ఒకరిద్దరితో చెప్పినట్లు కూడా జ్ఞాపకం.........నన్ను వెధవకిందనే కట్టి ఉంటాడు!

అది మొదటి వికారం.

రెండో వికారం పెళ్ళయిన తరవాత నా భార్య రజస్వలా కావటంతో ప్రారంభించింది. ఈ లోపుగా నా భార్యను వదిలేసి మరుపెళ్ళి చేసుకుని లోకాన్నెదుర్కోలేనని తేలిపోయింది. పైగా నా భార్య రజస్వలా అయిందని తెలియగానే దాని ఆకారం సుషుప్తి జాగ్రతత విచక్షణ లేకుండా కళ్ళలో మెదలటం మొదలు పెట్టింది. కాస్త కనువిప్పయింది; కాని అల్లుడి తనం వెనకంజ వెయ్యలేదు మామగారి మీద కోపం భార్యమీద చూపించట మేమిటి? మనలోమాట! అంత చక్కని పెళ్ళాన్ని అంత స్వల్ప కారణానికెవడైనా వదులుకుంటాడా? నే నంత మూర్ఖుణ్ణా? నాకు ముందూ వెనకా, సంగతీ సందర్భం — దాం దుంప తెగా! — అంత మరీ తెలియదా? పసివాణ్ణా?

ఇది రెండో వికారం. ఈ మార్పు కేవలం భార్యను పోగొట్టుకోకుండా ఉండగలందులకేనని స్పష్టంగా తెలిసిపోతున్నదనుకుంటా. హృదయంలో మామగారిని గురించి అభిప్రాయభేదం ఏమీలేదు. ఆ మాటకొస్తే పైకి కూడా చెప్పుకోదగ్గదేమీ లేదు. ఈ లోపల మామగారుంచుకున్న మనిషిని గురించి విన్న రెండు ముక్కలూ — అందమైన మనిషనీ, పరాయివాడివంక మొహం ఎత్తి చూడదనీ — నా అభ్యంతరాన్ని మరింత బలపరిచినై అని కూడా తెలుసుకోవాలి!

ఆ కాస్త పనీ — నా పెళ్ళి — చేసేసి సంవత్సరం జరక్కమునుపే తను కాస్తా పరమపదం వేంచెయ్యటంలో మా బాబాయి ఎంతమాత్రమూ పెద్దమనిషి తరహాగా ప్రవర్తించలేదని భావించాను.

నా పెళ్ళాం పెద్దమనిషై సంవత్సరం కావచ్చింది. భార్యను కాపరానికి పంపించవలసిన బాధ్యత మామగారి మీద ఉంచకుండా ఈ పాడు సంఘం భర్త చేతనే ఆ కాస ముక్కా అనిపించటం ఎందుకా అనుకున్నాను. ఎందుచేతంటే, వేరు పరిసితుల్లో నా కడగటానికి అభ్యంతరం లేదుకాని ఇప్పుడు నేను నిషేకం చెయ్యమని మామగారి నడగటం “నువ్వు బోగందాన్ని ఉంచుకున్నందుకు నా కేమీ అభ్యంతరంలేదు!” అని ఒప్పుకున్నట్టేగా! ఏ విధంగానైనా మామ

గారి చేతనే "అబ్బాయీ, పిల్లను తీసుకుపో అమ్మా !" అని చెప్పించుకుని, "చిత్తం, మామగారూ, మీరా భోగందాన్ని వదిలేస్తే తప్ప నేను మీ పిల్లతో కాపరం చెయ్యలేను; క్షమించండి !" అని బెట్టుచేసి, ఆయన్ను రిఫారం చేసి నా భార్యను తీసుకు చక్కా వద్దామని ! మరి ఆయన నోటంట ఆ మాట రావా లంటే కనీసం మూడు సంవత్సరాలైనా ఓపిక పట్టాలి. అప్పుడుగాని సంఘం ఆయన మీదికి తన తీక్ష్ణ దృష్టి ప్రసరింప చెయ్యదాయె !

పోనీ ఈ లోపల పుకారు చేస్తే ఫలాని వారల్లుడు పెళ్లాన్ని ఒల్లడటా అని చేశాను ! ఏమీ ఫలం కలగలేదు.

మరో ఆరునెల్లు చూసి రోషం పట్టలేక ఓ రోజు మా మామగా రూరు బయలుదేరాను. ఆయన నన్ను గౌరవంగానే చూశాడు. నేను ఆయన గౌరవం అట్టాపుంచి ప్రచండమైన ఉపన్యాసం ఇచ్చాను – ఆయన కేళ్ళొచ్చినై కాని బుద్ధి రాలేదన్నాను; (పాపం ఆయన కప్పటికి ముప్పై ఏళ్ళే !) తను సంఘంలో వున్న సంగతీ, తను దాన్ని అతిక్రమించటంవల్ల మా కందరికీ ఎంత తలవంపు అవు తున్నదో నలుగుర్లో, ఆ సంగతీ తెలియజేశాను; ముందు తెలిసుంటే ప్రాణం పోయినా ఈ సంబంధం చేసుకుని ఉండేవాణ్ణి కానన్నాను; తను ఆ భోగందాన్ని వదిలేసేదాకా, నేను యింట్లో అడుగు పెడతాననుకోవటం పట్టి భ్రమ అన్నాను.

"అం! నీకు నా మీద ఉన్న ఆపేక్ష కొద్దీ ఆ మాటంటున్నావు కాని ఇప్పుడు రాలేదా ఏమిటి ?" అన్నాడు తొందరపడకుండా. దాంతో మరింత మండిపోయి మరింత పేలాను.

ఆయనతో మాట్లాడుతుండగానే ఒక దివ్యమైన ఆలోచన తట్టింది; నే నిప్పుడే వెళ్లి నా భార్యను నాతో మాయింటికి వచ్చెయ్యమంటే ? ఎందు కంటే, ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో మొగుడట్లా అడగ్గానే భార్యా వచ్చేయటం కద్దు – అవేవీ ? – కథల్లో వాటిల్లో. వెంటనే మా మామగారిని వదిలిపెట్టి గబ గబా లోపలికి వెళ్ళాను. నా పెళ్ళాం లోపల ఏదో అల్లుకుంటున్నది. దాన్ని చూడ గానే నేను నిలువునా వెన్న కరిగినట్టు కరగటం మొదలుపెట్టాను.

"ఒరే వెధవా ! ఎందుకురా నీకూ దీనికీ మధ్య మీ మామగారి సానిదాన్ని తెచ్చి పెట్టుకుంటావు ?" అన్నె అంది నా అంతరాత్మ. దాన్ని నోరు మూసుకో మని నా పెళ్ళాంతో "వస్తావా ?" అన్నాను. నా పెళ్ళాం వెంటనే కథానాయకలే తలవంచుకొని కాలి బొటనవేలు నేలరాస్తూ ఒయ్యారంగా నన్ను చూస్తూ కోకిల మృదుమధుర స్వరంతో "ఊం!" అనకు, "ఎక్కడికండి" పుట్టెడాశ్చర్యం కన బరుస్తూ. నా ఇంటికని మళ్ళా అది కొట్టేసికునింటి కన్నాను. ఇట్టా ఎట్టా వస్తా నంది. కాస్సేపు నా మనస్సు విరిగిపోయినట్టు నా మనస్సునే ఒప్పించి అక్కణ్ణించి బయలుదేరాను.

వెధవపని చెయ్యటానికి కార్యదీక్ష చాలా ఉంటుందల్లే ఉంది !.......

నా ప్రయత్నం ఇంత విఫలమైం తరవాత మరో ఎత్తు ఆలోచించాను ! ఏకంగా ఆ బోగందాని ఇల్లే కనుక్కొని దాన్నే దబాయిస్తే "మా మామగార్ని వదిలి పెడతావా ? లేకపోతే–" ఏ విధంగా బెదిరించాలో అప్పుడే ఆలోచించవచ్చు — స్వల్పవిషయం ! భయపడకపోతే డబ్బుకూడా తెలీలా ?

దానిల్లు గుడివీధిలో ఉందన్నారు; దానిపేరు చంద్రకాంతమని కూడా అన్నారు. ఆ ఇల్లు చూపించినందుకే ఒకడు నా దగ్గిర అణా గుంజాడు !

నే నంతకు పూర్వం బోగం కొంపలు చూడలేదుగాని ఆ ఇల్లు అచ్చగా బోగం కొంపల్లేనే ఉంది. ప్రవేశించటమే చిన్న హాల్లోకి ప్రవేశిస్తాం. ఆ హాల్లో గోడలకు పాడు పటాలు తగిలించి ఉన్నై. ఒక నులక మంచం వాల్చి ఉంది. గోడ కానించి ఒక పొడుగు బల్లా. ఆ హాలు పక్క గోడలో రెండు వాకిళ్ళు ఒకటి వంట ఇంట్లోకీ మరోటి గదిలోకీ.

నే నింటో అడుగు పెట్టగానే వంట ఇంటోనించి ఏవో నములుతూ నృత్యం చేస్తున్నట్టుగా నడుస్తూ పదహారేళ్ల పిల్ల ఒకతె వచ్చింది. దివ్య సుందర విగ్రహ మంటే నమ్మండి. నన్ను చూసి నృత్యం మానేసి "ఎవరండీ కూర్చోండి !" అంది. నేను నులకమంచం మీద కూర్చున్నాను. ఆ పిల్ల ఎక్కణ్ణించో మరికొన్ని నములుడు పదార్థాలు సృష్టించి దవడ లాడించటం మొదలుపెట్టింది.

"చంద్రకాంతం ఉండే దీ ఇంట్లోనేనా ?" అన్నాను.

ఆ పిల్ల ఒయ్యారంగా తలతిప్పి "ఆఁ !" అంది.

"నీ పేరేమిటి ?" అన్నాను.

"దమయంతి !"

"చంద్రకాంతాని కేం కావాలి ?"

"చెల్లెల్ని"

ఈ మూడో వికారం నాకు తెలియకుండానే ప్రారంభమైంది. రెండు నిమిషాలు దమయంతితో మాట్లాడేటప్పటికి ఆ పిల్ల మీదినించి కళ్ళు పక్కకు తిప్పలేకపోయినాను. నా భార్య కథానాయకల్లే ప్రవర్తించలేక పోయిన క్షణంనించి నా మనస్సు అన్యాధీనం కావటానికి సిద్ధంగా ఉంది. ఇంతకన్న అందమైన కన్య ఎక్కడ దొరుకుతుంది ? నా భార్య నాతో అల్లా మాట్లాడినందుకు నేను పగ తీర్చు కోవలసిన అవసరం కూడా ఉండాయెను !

"నువ్వు వృత్తిలో ఉంటున్నావా ?" అన్నాను.

"అంటే ?" అంది దమయంతి అర్థం కానట్టు.

"అంటే, నాకు ఒక ముద్దు పెట్టటానికి నీ కేవిధమైన అభ్యంతరమన్నా ఉంటుందా అని !"

అంతవరకూ మంచుకుండల్లే ఉన్నాను కాని ఈ మాట అన్న తరవాత నాలో శక్తివంతమైన యంత్రం ఆడటం మొదలుపెట్టినట్టయింది. ఆ ఉద్రేకంలో చెమట కూడా పట్టింది.

దమయంతి దేవతలు మెచ్చే నవ్వొకటి నవ్వి

"ఎబ్బే ! పగలేనా ? రాత్తిరికి ఏడు గంటలకు," అని పోబోయింది.

"ఒక్కటి !"

"రాత్తిరికి ఏడు గంటలకు !" అంటూ దమయంతి పడకగదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంది.

చంద్రకాంతం సంగతి కనుక్కోటం మరిచిపోయినానని కనుక్కోలేదు నేను. ఆ ఇంటోకి పోయినవాడూ బయటికొచ్చినవాడూ ఒకడుకాడు !

ఆ రాత్రి గడియారం ప్రకారం ఏడుగంటలకు ఆ ఇంటో అడుగు పెట్టే టప్పటికి నేను తప్పతాగిన వాడికన్న అన్యాయంగా ఉన్నాను.

మళ్ళా హాల్లో ముస్తాబైన దమయంతే కనపడ్డది. ఆ మొహాన చిరునవ్వు లేదు.

నన్ను చూడగానే ఉత్త పొడిగౌరవం చూపించింది.

"అట్లా గదిలోకి వెళ్ళండి !" అంది. ప్రయత్నంగా గదివాకిలి సమీపించి తలుపు తెరుస్తుండగా నా వెనకనించి "మీ అల్లుడు గారంటే ! మీ కోసం వచ్చి నట్టున్నారు !" అన్నది.

మా మామగారు కుర్చీలో కూర్చుని చదువుకుంటూ నావంక తిరిగి చూడకుండానే ఆ "రావోయ్, అట్లా కూరో్చ !" అన్నాడు మృదువుగా.

*ముద్రణ : 1 ఏప్రిల్ 1945, చిత్రగుప్త.*